Office Of The Advisor (Communications)
Govt. Of Andhra Pradesh

# తొలుత సచివాలయ నిర్మాణం

## వచ్చే ఏడాదికి శాఖాధిపతుల కార్యాలయాలు, ప్రభుత్వ ఆవాసాలు సిద్ధం

## నిడమానూరు వరకు బెంజ్ సర్కిల్ ఫ్లయ్ వోవర్

### అమరావతిలో హ్యాపీ సిటీ సమ్మిట్–ఇన్నోవేషన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్

అమరావతి, జనవరి 31 : రాజధానిలోని పాలనా నగరంలో తొలుత సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయ భవనాలు, ప్రభుత్వ ఆవాసాలను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. పరిపాలన నగరంలో చేపట్టే అన్ని నిర్మాణాలలో మొట్టమొదటి ప్రాధాన్యంగా ఈ మూడు ప్రాజెక్టులను పూర్తి చేసి వచ్చే ఏడాదిలోనే వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తెలియజేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) సమావేశంలో రాజధానిలో చేపట్టిన రహదారులు, పరిపాలన నగర శాశ్వత భవంతుల నిర్మాణాలు తదితర అంశాలతో పాటు, మెరీనా, ఐటీ టవర్లు, హెల్త్ స్ట్రీట్, కంటైనర్ హోటళ్లు వంటి ఎకనమిక్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. అమరావతిలో వచ్చే ఏప్రిల్‌లో జరగనున్న సంతోష నగరాల సదస్సు, 9 మాసాలలో పూర్తి చేయాల్సివున్న ఇంటెరిమ్ హైకోర్టు నిర్మాణ ప్రణాళికపై కూడా ఈ సమావేశంలో చర్చించి కొన్ని ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు.

సచివాలయం, శాఖాధిపతుల భవంతుల నిర్మాణ ప్రణాళికలను నార్మన్ ఫోస్టర్ సంస్థ ఈ రాత్రిలోగా తమకు పంపుతున్నట్టు తెలియజేసిందని, వీటికి మార్చిలోగా టెండర్లను పిలిచి పనులు ప్రారంభిస్తున్నట్టు సీఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ముఖ్యమంత్రికి వివరించారు. హైకోర్టు భవంతి ఆకృతులు, నిర్మాణ ప్రణాళికలు ఫిబ్రవరి 4 లేదా 5వ తేదీలోగా రానున్నాయని తెలిపారు. శాసనసభ భవంతి ఆకృతులు మరో రెండు వారాలలో వస్తాయని చెప్పారు. వచ్చే అక్టోబర్ నాటికి ప్రభుత్వ ఆవాసాలు మొత్తం సిద్ధం కానున్నాయని సీఆర్‌డీఏ కమిషనర్ చెప్పారు. మొత్తం పది ప్రదేశాలలో 69 టవర్ల నిర్మాణం శరవేగంగా సాగుతున్నట్టు తెలిపారు. శాసనసభ్యులు, అఖిల భారత సర్వీస్ అధికారులకు 18 టవర్లలో 144 ఫ్లాట్లు, ఎన్జీవోలకు 22 టవర్లలో 1968 ఫ్లాట్లు, టైప్ 1, 2 అధికారులు, గ్రూప్ డి ఉద్యోగులకు 21 టవర్లలో 1440 ఫ్లాట్లను నిర్మిస్తున్నామని తెలిపారు. వీటన్నింటికీ రాఫ్ట్ స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం నిర్మించే రెసిడెన్షియల్ టవర్స్ అన్నింటిలో క్లబ్ హౌస్‌తో పాటు కచ్చితంగా స్విమ్మింగ్ పూల్ కూడా ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. అమరావతిలో పనిచేసే ఉద్యోగులు, అధికారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని, స్విమ్మింగ్, సైకిలింగ్ వంటి మంచి అలవాట్లలో వారి జీవనశైలిలో తప్పక మార్పు వస్తుందని అన్నారు.

## ఐటీ స్పేస్ 2 టవర్లు

అమరావతిలో ఐటీ కంపెనీల కోసం ఆఫీస్ స్పేస్ నిర్మాణాలను చేపట్టడానికి సీఆర్‌డీఏ ప్రతిపాదనలను సిద్ధం చేసి ముఖ్యమంత్రి ముందుంచింది. ముందుగా సీఆర్‌డీఏ ఈ ప్రాజెక్టును చేపడుతుంది. తరువాత చేపట్టే నిర్మాణాలను అభివృద్ధిదారుకు అప్పగిస్తారు. ప్రభుత్వం రూపొందించిన ఐటీ పాలసీకి అనుగుణంగా వీటి నిర్మాణాన్ని చేపడుతున్నారు. తొలుత, 10 లక్షల చదరపు అడుగుల మేర జంట భవంతుల నిర్మాణాన్ని చేపడతారు. 42 ఐటీ సంస్థల నుంచి 5 లక్షల చదరపు అడుగుల వరకు ఆఫీసు స్పేస్ కావాలని రిక్వయిర్‌మెంట్ వచ్చిందని, మరో 5 లక్షల చ.అ. కోసం సంప్రదింపులు చేస్తున్నారని అధికారులు చెప్పారు.

ఐటీ టవర్లలో మొదటి దశ నిర్మాణాన్ని 12 మాసాలలో, రెండవ దశను 24 నెలలలో పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్టుతో వీటిని నిర్మించాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు. సీఆర్‌డీఏ నిర్మిస్తున్న ఆఫీస్ స్పేస్‌ను విక్రయించడం ద్వారా చదరపు అడుగుకు రూ.3 వేల వంతున ధర రావచ్చునని అంచనావేశారు. మొత్తం రూ.90.6 కోట్ల ఆదాయం సమకూరవచ్చునని భావిస్తున్నారు.

పరిపాలన నగరం మధ్యభాగంలో 7 ఎకరాలలో నిర్మించే సిటీ స్క్వేర్‌కు ఒకవైపు స్టేడియం, మరోవైపు కన్వెన్షన్ సెంటర్ నిర్మించే ప్రతిపాదనలను ముఖ్యమంత్రి ముందు ఉంచగా, స్టేడియం అక్కడ కాకుండా స్పోర్ట్స్ సిటీలోనే నిర్మించాలని ఆయన సూచించారు.

## ఇంటెరిమ్ హైకోర్టు భవనం

ఇంటెరిమ్ హైకోర్టు భవంతి నిర్మాణ ప్రణాళికపై ఈ సమావేశంలో సీఆర్‌డీఏ అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. 4 ఎకరాల విస్తీర్ణంలో ఇంటెరిమ్ హైకోర్టు భవన నిర్మాణం జరగనున్నది. 1.8 లక్షల చదరపు అడుగులలో గ్రాస్ ఫ్లోర్ ఏరియా ఉంటుంది. జీ ప్లస్ 2 పద్ధతిలో భవన నిర్మాణాన్ని చేపడుతున్నారు. ప్రధాన న్యాయమూర్తి కోసం 2000 చదరపు అడుగులలో కోర్టు రూమ్, 1200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఛాంబర్ నిర్మిస్తారు. మరో 1000 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో 18 కోర్టు హాళ్లు, 600 చదరపు అడుగుల చొప్పున న్యాయమూర్తుల ఛాంబర్లు ఉంటాయి. ఇంటెరిమ్ హైకోర్టు భవన నిర్మాణానికి రూ.108 కోట్ల వ్యయం కాగలదని అంచనా వేశారు. 6 నుంచి 8 మాసాల వ్యవధిలో మొత్తం నిర్మాణం పూర్తి చేస్తామని సీఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ చెప్పారు.

## పనుల్లో వేగం పుంజుకోవాలి: ముఖ్యమంత్రి

అమరావతి నగర నిర్మాణం ఇక వేగం పుంజుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. సీఆర్‌డీఏ పరిధిలో చిన్నచిన్న పనులకు కూడా కాలయాపన జరుగుతోందని, ఇక మీదట అలా జరగరాదని చెప్పారు. రాజధానిలో 85 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న రహదారి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీ శ్రీమతి లక్ష్మీపార్థసారథి ముఖ్యమంత్రికి వివరించారు. రహదారి నిర్మాణంలో గ్రావెల్ అవసరం మరింతగా ఉందని చెప్పారు. అనంతవరం కొండ ప్రాంతం నుంచి గ్రావెల్ తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. వైకుంఠపురంలో ప్రతిపాదిత

రిజర్వాయర్ నిర్మాణానికి గ్రావెల్ అవసరమైనప్పుడు కొండవీటివాగు నుంచి వచ్చే గ్రావెల్‌ను వినియోగించుకోవచ్చునన్నారు.

## నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహం

అమరావతిలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎత్తయిన కొండపై 108 అడుగుల ఎత్తున ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై అధికారులు ఈ సమావేశంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. రాజధానిలో అంబేద్కర్ విగ్రహాన్ని 125 అడుగుల ఎత్తున ఏర్పాటు చేస్తున్నామని, నీరుకొండ ఎత్తులో ఉన్న దృష్ట్యా ఎన్టీఆర్ విగ్రహం ఎత్తు కొంతమేర తగ్గించవచ్చునని సమావేశంలో పలువురు చేసిన సూచనను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సీయం చెప్పారు. శాఖమూరు ఉద్యానవనంలో భాగంగా 19.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న గాంధీ పార్కుపై ఈ సమావేశంలో వీడియో ప్రెజెంటేషన్ ప్రదర్శించారు. పూజ్య బాపూజీ స్మృతిచిహ్నంగా నిర్మించే ఈ పార్కుకు 'గాంధీ టు మహాత్మా పార్కు' అనే పేరు పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. గాంధీ పార్కుతో పాటు రాజధానిలో మరో రెండు ప్రాంతాలలో బాబూ జగజ్జీవన్ రామ్, జ్యోతిరావు పూలే పేరిట పార్కులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## అమరావతి మెరీనా

6 ఎకరాల విస్తీర్ణంలో అమరావతి మెరీనా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలించారు. బోట్లు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సెయిలింగ్ ట్రైనింగ్ సెంటర్, పవర్ బోటింగ్, ఫుడ్ కోర్టు, కన్వెన్షన్ సెంటర్ వంటి సదుపాయాలతో మెరీనా ఏర్పాటు చేస్తారు. పీపీపీ పద్ధతిలో దీని నిర్మాణాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.

## భవానీద్వీపంలో సంతోష నగరాల సదస్సు

ఏప్రిల్ 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు జరిగే సంతోష నగరాల సదస్సు ద్వారా మరోసారి అమరావతి ప్రాభవాన్ని ప్రపంచానికి చాటే అవకాశం దక్కిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభిప్రాయపడ్డారు. సంతోష సూచికలో తొలి 50 స్థానాలలో ఉన్న నగరాలకు లేఖలు రాయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయా నగరాలలో అమలుచేస్తున్న ఉత్తమ విధానాలు, వినూత్న పద్ధతుల గురించి మనం తెలుసుకునేందుకు ఈ అంతర్జాతీయ సదస్సు తప్పకుండా దోహదపడుతుందని అన్నారు.

'భూటాన్, సింగపూర్, యుఏఈలలో హ్యాపినెస్‌కు ప్రత్యేకంగా మంత్రిత్వశాఖలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సంతోష సూచికను ప్రామాణికంగా తీసుకుంది. ప్రజల సంతృప్తి, సంతోషాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇటువంటి సమయంలో జరుగుతున్న సంతోష నగరాల సదస్సు ఈ దిశగా మనం చేసే కృషికి తప్పక దోహదపడుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 'సిలికాన్ వ్యాలీ' తరహాలో మన రాష్ట్రం ఇన్నోవేషన్ వ్యాలీగా అవతరించాలని, వినూత్న ఆలోచనలకు ఆంధ్రప్రదేశ్ వేదికగా నిలవాలని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకోసమే త్వరలో ఇన్నోవేషన్ సమ్మిట్ ఏర్పాటుచేస్తున్నామని ప్రకటించారు. ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, స్టార్టప్ అంశాలలో మన రాష్ట్రం మిగిలిన ప్రపంచానికి రోల్‌మోడల్ కావాలన్న లక్ష్యాన్ని ముందు పెట్టుకున్నామన్నారు.

అమరావతి–విజయవాడకు మధ్యలో కృష్ణానదిలో ఉన్న భవానీద్వీపం సంతోష నగరాల సదస్సు నిర్వహణకు వేదికగా అన్నివిధాలుగా అనుకూలంగా ఉంటుందని ఈ సమావేశంలో ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చారు. 'అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ టు గ్లోబల్ లివింగ్' అనే థీమ్‌తో జరగనున్న సంతోష నగరాల సదస్సుకు 2 వేల మంది అతిథులు వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. వీరందరికీ విజయవాడ, గుంటూరు నగరాలలోని హోటళ్లలో వసతి కల్పించాలని చెప్పారు. అవసరమైతే భవానీద్వీపంలోనే 200 తాత్కాలిక గదులతో వసతికి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అమరావతిలో నెలకొల్పాలనుకుంటున్న 100 కంటైనర్ హోటల్ రూములను తొలుత ప్రయోగాత్మకంగా భవానీద్వీపంలో ఏర్పాటు చేయడం ద్వారా సంతోష నగరాల సదస్సుకు వినియోగించుకోవచ్చునన్న ప్రతిపాదనను పరిశీలించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పేరొందిన స్టార్ హోటళ్ల నిర్వహణా భాగస్వామ్యంతో అమరావతిలో కనీసం 100 కంటైనర్ హోటల్ రూములను ఏర్పాటు చేయాలని సూచించారు. సిటిజెన్ సెంట్రిసిటీ, అర్బన్ ఇన్నోవేషన్, నెక్ట్స్ జనరేషన్ టెక్నాలజీ, అర్బన్ ప్లానర్లు, అర్బన్ ట్రాన్స్‌పోర్టేషన్, ఆర్కిటెక్చర్–డిజైనింగ్ వంటి అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చలు సాగాలని, ఆ చర్చల సారం రాజధాని నిర్మాణానికి ఉపయోగపడాలని ముఖ్యమంత్రి అన్నారు. మేయర్లు, నగర పాలకులు, అర్బన్ ప్లానర్లకు ఈ సదస్సు ఉపయుక్తంగా ఉండాలన్నారు. రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్, బ్లూమ్‌బెర్గ్ ఫిలాంథ్రోపీస్ ఈ సదస్సుకు ప్లాట్‌ఫామ్, మీడియా పార్టనర్లుగా ఉన్నారని అధికారులు తెలిపారు. యూఏఈ, భూటాన్, సింగపూర్ ప్రభుత్వ ముఖ్యులను, కేంద్ర మంత్రులను ఈ సదస్సుకు ఆహ్వానించాలని సూచించారు.